# దుమ్ములు

-వివినమూర్తి

లారీ లొచ్చాయ్ ! లారీ లొచ్చాయ్ !

మునిమాపువేళ ఆ గూడెంలోకి ఆ వార్త దూసుకువచ్చింది.

పొయ్యి రాజేస్తున్న వాళ్ళు లేచారు. బియ్యం ఉడకేస్తున్న వాళ్ళు లేచారు. బండలమీద కారాలు నూరుతున్న వాళ్ళు లేచారు. ఉడుకునీళ్ళు పోసుకుంటున్న వాళ్ళు లేచారు. అడ్డచుట్ట బిగించి గంజి చుక్కలకోసం తపస్సు చేస్తున్న ముసలి వాళ్ళు లేచారు. కరెంటు స్తంభాల దగ్గర వెలుతుర్లో ఆటలాడుకుంటున్న వాళ్ళు లేచారు. ఊసులేసుకుంటున్న వాళ్ళు లేచారు. గూడెం గూడెమంతా లేచింది.

వార్త మోసుకువచ్చిన వాచ్‌మన్ కొండయ్య తాత నర్సింహులుతో చెప్పాల్సింది చెప్పేసి, మరే ప్రశ్నలూ వేసే సమయం ఇవ్వకుండా మళ్ళీ దుమ్ముల మిల్లు వైపు వెళ్ళిపోయాడు.

ఒరిస్సా నుంచి ఆ ఫాక్టరీలోకి దుమ్ములతో లారీలు వస్తాయి. గూడెంలోంచి మనుషులు వస్తారు. బరువు దించుకున్న లారీలు జేబులు నించుకున్న బాబూలని వేసుకుని తిరిగి వెళ్ళిపోతాయి. బరువు దించిన మనుషులు చేతిలో పడ్డ డబ్బులని పంచుకుని మళ్ళీ గూడెంలోకి వెళ్ళిపోతారు.

లారీలనీ-మనుషులనీ, మనుషులనీ-లారీలనీ చూసి చూసి విసుగెత్తి, వెర్రెత్తి మిల్లు కసిగా, ఉన్మాదంగా ఎవరి మాటలూ వినకుండా ప్రతి రోజూ ఎనిమిది గంటలసేపు అరుస్తూనే ఉంటుంది.

ఆనాటి మనిమాపువేళ - చిన్నదిగా మొదలైన గుంపు క్రమంగా పెద్దదైంది.

ముసిలాళ్ళు ఓ జట్టు అయ్యారు. పడుచువాళ్ళు ఓ జట్టు అయ్యారు. నడికారువాళ్ళు మరో జట్టు అయ్యారు. చిల్లో బొల్లో మంటున్నారు. కబుర్లు సాగుతున్నాయి. మనుషులు సాగుతున్నారు. హొరెత్తుతున్న సముద్రానికి కాళ్ళొచ్చి కదిలి వస్తున్నట్టుగా దూరానికి వాళ్ళ సవ్వడి వినవస్తోంది.

పొద్దల్లా అరిచి అరిచి అలిసిపోయిన ప్రాణం లేని ఆ మిల్లు మానవ శ్రమను తగ్గించలేకపోతున్నానన్న చింతతో, పడుకుని నెమరువేసుకుంటున్న గంగిగోవులా ఉంది.

అరమైలు దూరం నుంచి ఆ చీకటి పడ్డవేళ కదలివస్తున్న జనం కోసం కళ్ళలో వత్తులు వేసుకుని ఎదురుచూస్తున్న తల్లిలా కూడా ఉంది ఆ మిల్లు.

ఆ గుంపులో ఓ గొంతు మహోద్రేకంగా లేచింది.

"ఏదేటయినా... యియ్యాల తేల్సెయ్యాలిసిందె?"

ఆ జట్టంతటా ప్రచలితమవుతున్న భావమే ఆ వాక్యంగా బయటకు వచ్చింది. పడుచువారి జట్టు ఆ గుంపుకి కాస్త దూరమైంది.

"ఆ మునల్నాక్కలు ఎలాగంటే సావనీ ! మనం ఎళ్ళొద్దు."

ఆ నిర్ణయానికి వచ్చిన జట్టు నేరుగాపోయి నర్సింహులుని నిలబెట్టింది.

"ఇప్పుడు రాజుగా రుండర్రా" అన్నాడు, అందరి మాటలూ విన్న నర్సింహులు. ఒక్కసారిగా అందరి గొంతులూ లేచాయి.

"ఏటర్రా... ఏటదీ? మాటాడేవోడెవడో ఒక్కడే మాటాడాలి !" ఓ నడికారు మనిషి అజమాయిషీ గొంతుతో అన్నాడు.

అరుంధతి అంది - "మన వెప్పుడన్నా అనుకునేదే గదా ! నీకు మతి లేదా తాత? ఆ కొండయ్య నడగకుండా ఎందుకు వొగ్గేసావ్?"

రోడ్డు వారనే తూముమీద చతికిలపడ్డాడు నర్సింహులు. ఆ రోడ్డుకి అటూ ఇటూ నిలబడున్న చెట్లు చీకటిని అమ్ముకుంటున్న రాకాసి వ్యాపారుల్లా ఉన్నాయి-

"అది సెప్పింది నిజవేఁ మరి... ! ఆ డెళ్ళిపోయాడు. అడగనేదు" అన్నాడు నర్సింహులు తలూపుతూ.

"ఈ గుంట పావల మాటట్టుకుని మనం పనిలోకి యెళ్ళమంటే ఆ సామ్మీలుగాడు కాసుకున్నాడు, తన్నుకుపోతాడు."

"ఆ మాటా నిజవేఁ !" నర్సింహులు తలూపాడు మళ్ళీ.

"ఎక్కడికి తన్నుకుపోతాడు? ఆడయినా మననే ఎట్టుకోవాల ! దుమ్ముల్లో సెయ్యెట్టటానికి మనం గాక ఎవరొస్తారు ! ఆ రెట్టీదానికీ మనం తినీదానికి మద్దిన మరోడు సేరతాడు ! సేరనీ !"

"అదీ నిజవేఁ" అన్నాడు నర్సింహులు.

పెద్దాళ్ళిలా మాట్లాడుకుంటున్నారు. చిన్నపిల్లలు అక్కడికక్కడే ఆటలు మొదలుపెట్టారు. అందులో గొడవ కూడా వచ్చింది. ఎవరో ఎవరినో కొట్టారు. తిన్నవాడు బూతులు ఎత్తుకున్నాడు. గట్టిగా ఒకళ్ళు వాళ్ళని కసిరారు. పిల్లల అల్లరి తగ్గింది.

ప్రతిదాన్నీ నిజమేనని నర్సింహులు అనడం కుర్రకారుకీ, నడికారుకీ నచ్చలేదు. ఎవరూ ఆ మాట అనలేదు. ఓ పెద్దగా అతను ఏదో నిర్ణయం తీసుకోవాలి. కష్టానికీ, సుఖానికీ అయేదీ - అందర్నీ ఓ మాటమీద ఉంచేదీ - వయసుకీ, అనుభవానికీ సంబంధించిన పెద్దరికమది.

"తాత ! నువ్వు ఏదో ఒకటి చెప్పాలి." అభ్యర్థనగా ఉం దా గొంతు.

ఎవ్వరూ మాటలాడలేదు. అంతా తన మాట కోసం చూస్తున్నారని గ్రహించాక నర్సింహులు అన్నాడు.

"రాజుగా రుండరు."

"ఉన్నావోళ్ళనే అడుగుదారి."

"ఎవుర్ని? ఆ గుమస్తా బాబునా?"

"అవునూ... ఆరినే !"

"ఆ బాబేం సేత్తడూ?"

"పెద్దాయనతో సెవుతానంటాడు."

"దానివొల్ల ఏటవుద్ది...?"

కొంతసేపు ఎవరూ మాట్లాడలేదు. అరుంధతి మెల్లగా అంది.

"ఏటవుద్ది? సెవుతాడు."

"సెప్పితే...?"

ఎవరూ మాట్లాడలేదు. నర్సింహులు అందర్నీ కలియజూశాడు.

"సెవుతాడు. ఆరూ ఇంటారు. సూద్దారి అంటారు. ఆ సచ్చిన ముసలి గుమస్తా బాబు మనకు అదే సెప్పేవాడు. మనం రాజుగోర్నే అడిగితే గుమస్తాతో సెప్పలేకపోయారా - అంటాడు. సెప్పామయ్యా - అన్నాం ! సెప్పలేదేమయ్యా - అంటాడు గుమస్తాని. ఆయనో ఎకిలినవ్వు నవ్వేవోడు. సిప్‌మెంట్ అవాలంటాడు. అయాక గుమస్తా బాబుని మతి సెయ్యమంటాడు - యిది గిలాగయ్యి మూడో సుట్టు."

ఎవరూ మాట్లాడలేదు. నర్సింహులు ఆగి మళ్ళీ అన్నాడు.

"ఆరయినా తన కో అణా డబ్బులు మిగిల్తే మన కో కానీ ఎట్టీమడిసే ! ఆ మద్దిన మన సీతాలుకి పెళ్ళంటే వంద కాయితం చేతిలో యెట్టారు. అప్పడి పెళ్ళాం పోయిందంటే ముప్పై రూపాయ లిచ్చారు. నూసీ నూడకా ఆయన సేసీ ఉపకారాలు మనందరికీ తెలుసు. ఆరు బతికి సెడ్డా మనిషి. కొడుకు సినిమాలు తీద్దారని నాశనం జేశాడు. ఆరి తండ్రిగోరు దానాలనీ, ధర్మాలనీ సెడ్డాడు. ఆరి నేటి అడుగుతాం? పెట్టీ మారాజు కాళ్ళట్టుకు అడుక్కోవాలిగాని... నిలదీసి ఎట్టా గడుగుతాం?"

"అయితే ఏంజేద్దా రంటావు తాత?" ఉద్రేకం తగ్గిన గొంతు నరెండర్ అవుతున్నట్టు ధ్వనించింది.

నర్సింహులు ఆలోచనగా అన్నాడు - "ఆరి

బాధలు ఆరియ్యి. మన బాధలు మనయ్యి ! ఆరు మంచోరే ! ఉపకారాలూ సేసారు ! నిజఁవే ! మా ముసిలోళ్ళకి ఉపకారా లంధాయని మా బిడ్డలకి నోరు ఎండబెట్టడవ్వఁ నాయం గాదు... మాం ఉపకారా లందుకుని మా బిడ్డలనీ ఉసిగొలపడవ్వఁ నాయం గాదు... ఈ మిల్లు యీ బాబుగోరి కిందకొచ్చి పన్నెండేళ్ళయింది. ఆరంతట ఆరే కానో పరకో పెంచారు. నాలుగేళ్ళయింది. ఆరు పెంచాలేకపోతున్నారు. మనకీ ఎలా అడగాలో తెలటంలేదు."

స్వగతంగా అన్నట్టు అన్నాడు నర్సింహులు నిట్టూరుస్తూ.

"యియ్యేల గట్టిగా అడిగితే గాని గుంట పాపలని పట్టుకోలేం. ఈ గుమస్తాబాబు కుర్రాయన. మంచాయన. మనం సెపీలా సెపితే అడిగీలా అడుగుతాడు." ఓ నడికారు మనిషి.

"ఏం మంచి? మిల్లులో ఏకాడ సూసినా ఆ బాబే. ఓ నుట్ట గాల్సుకోనివ్వడు ! ఓ చెణం అటూ ఇటూ మునలనీడు. బెనగనీడు. ప్రేం జేసేవోడి కష్టం ఆ బాబుకేం తెలుస్తాది?" అంది పెత్తనాల రత్తాలు.

నర్సింహులు తూమ్మించి కోపంగా లేచాడు. "ఆ బాబుకి తెల్దు. నాకూ తెల్దు. నీకే తెలుసు కష్టం యిందరుండగా నిన్ను కూలికి ఉంచుతున్నారు గందా. బాగా సూపిత్తున్నావు యిశ్వాసం" అంటూ ఆగి - "అడగాల. అడుగుదారి. గట్టిగానే అడుగుదారి. అవుతే పని ఆపగూడదు. లారీలో నరుకు దించాపోతే కాటా యెయ్యాపోతే... బోవేదు."

"అదే బావుంటాది" అంది అరుంధతి.

నర్సింహులుతో బాటు అంత ఆమెవైపు చూశారు. ఆమె కొంచెం గాభరా పడింది. తొందరపడ్డానన్న గొంతుతో అన్నా స్పష్టంగా అంది. "కడుపెండినోళ్ళే అలాగే అడగా లనుకుంటాను తాత !"

ఎవరైనా తనకు వత్తాసుగా మాట్లాడతారా అని ఎదురుచూశాడు నర్సింహులు. "ఓసి పడమటిపిల్లా. నీకు మోకాళ్లో ఉందే ఆలోసన..." అని వెటకారం జేసే దేవుడూ మాట్లాడలేదు.

"మీ అందరిదీ ఆ మాటే అయితే... అలాగే కానివ్వండి. నే నెల్లిపోతాను." నర్సింహులు గూడెంవైపు తిరిగాడు.

ఒక్కసారిగా అందరూ అతనివైపు తిరిగిపోయారు. పదిమందీ అతన్ని పోనివ్వలేదు. అరుంధతిని కూకలేశారు. నరసింహులే చివరికి అందరినీ వారించాడు.

"దానికి తెలిసింది అది సెప్పింది. అది నచ్చుబాటయితే అంతా ఆ దోవనే పోవచ్చు. నాబోటి ముసిలాడు రాపోతే ఏటాగిపోద్ది? కబుర్లు చెప్పి మీ అందరితో వాటా గూడటానికే గాని నావల్ల అయిదేటుంది? నా మాటే రైటంటే అలాగా సెయ్యొచ్చు. గొడవ లేటికి?"

నర్సింహులు ముందు నడుస్తున్నాడు. గుంపంతా అతని వెనక నడుస్తోంది.

నా దుమ్ముల్ని పట్టిన బుద్ధి ఏటవుద్ది? ఆరి బాదలు సూడకుండా నా బాద సెప్పుకోడం సాతకాని ముసిలోణ్ణి. యీళ్ళమీద పెత్తనం వొగ్గలేనూ... యీళ్ళకి దోవా సూపెట్టలేను. ఛత్ ! నర్సింహులు ఆలోచనలు సాగిపోతున్నాయి.

మిల్లు దగ్గరవుతోంది.



14

దుమ్ముల వాసన ముక్కు బద్దలుకొడుతోంది. వస్తూన్నప్పుడు దోవలో వానలు పడ్డాయిట. నరుకు తడిసిపోయింది. మూడు లారీలు మిల్లు ముందు ఆవరణలో బరువు భుజాన ఉండి దించే వాళ్ళకోసం చూస్తూ చూస్తూ నించున్నట్టున్నాయి.

ఉన్నవి ఆరు కరెంటు దీపాలు. మరో రెండు పెట్రోమాక్సు లైటులు. ఆ విశాలమైన దొడ్డిని వెలుతురుతో నింపుతున్నాయి. ఓ దగ్గర మూడు కుర్చీలు ఉన్నాయి. వాటిల్లో మూర్తీ, ఒరిస్సా నుంచి వచ్చిన మిశ్రా, బింద్రా కూర్చుని ఉన్నారు. వచ్చీరాని హిందీలో ముగ్గురూ సంభాషిస్తున్నారు.

వాళ్ళకి కొంత దూరంలో ముడతమంచాలమీద డ్రైవర్లూ, క్లీనర్లూ కబుర్లలో ఉన్నారు. ఓ సర్దార్‌జీ బొంగురుగొంతుతో చిత్రంగా నవ్వుతున్నాడు.

వాళ్ళమధ్య గ్లాసులూ, పలావు పొట్లాలూ, తెరిచిన రెండు సీసాలూ ఉన్నాయి. నీళ్ళు లేకుండా నింపిన రెండో గ్లాసుని ఖాళీ చేసిన ఓ బిహారీ ఏదో పల్లె పదాన్ని అందుకున్నాడు.

ఆ రెండు గుంపులకీ దూరం హెచ్చుగా ఉంది.

మూర్తితో మాట్లాడుతున్న వాళ్ళలో ఒకతను చలాకీగా ఉన్నాడు. ఒరిస్సాలో వెనకబడినతనం గూర్చి మాట్లాడుతున్నాడు. తాను విన్న విషయాన్ని చెప్పాడు మూర్తి. వెనకబడిన వాళ్ళంటే ప్రేమించదగిన వాళ్ళన్న ఊహతో ప్రస్తావించాడు. సంజయ్ మిశ్రో అతని కుతూహలాన్ని ఎలా భావించాడో గాని, ఒరిస్సాలో వెనకబడినతనం లేదన్నాడు. సంస్కృతి గలిగిన వాళ్ళను ఆధునికుల మనుకునే వాళ్ళు వేళాకోళం చేయటానికి అలాంటి పేరు పెట్టారంటూ మొదలుపెట్టాడు. మూర్తికి అతనంటున్నది అర్థం కాలేదు. బింద్రా మాట్లాడుతూ పదే పదే వాచీ చూసుకుంటున్నాడు. అతను అలా చూసినప్పుడల్లా మూర్తీ చూసుకుంటున్నాడు. మూర్తివైపు బింద్రా చూస్తే - కొండయ్యవైపు మూర్తి చూస్తున్నాడు. కొండయ్య గేటు దాకా వెళ్ళి కనిపించినంత మేరా రోడ్డువైపు చూస్తున్నాడు.

"ఒరే ! కొండా..." మెత్తని గొంతు ఒకటి లారీ డ్రైవర్లమీంచి గాల్లో సాగుకుంటూ వచ్చింది.

వాళ్ళందరూ అటు చూశారు.

వాళ్ళ కంటికి కనిపిస్తూ ఉన్న ఆడమనిషి నిండుతనం ఎలాంటిదో అంచనాకు దొరికేముందే పరుగెత్తుకుంటూ వచ్చాడు కొండయ్య.

"ఏటే, ఎందుకొచ్చావ్?" అంటూన్న ఆ గొంతులోని కోపం భాషరాని వాళ్ళకు అందుతూనే ఉంది.

జాకెట్టు లేని రమణమ్మ కొంగుతో మెడకింద పట్టిన చెమట ఒత్తుకుంటూ, అప్పటివరకూ పచ్చి కర్రలతో పొయ్యిలో మంట పెట్టడాన్కి ఊది ఊది విసిరి విసిరి మండుతూన్న కళ్ళతో అంది.

"గూడెం వోళ్ళొత్తే నన్నూ పిలువు !"

"ను వ్వొచ్చి సెయ్యొయ్యాపోతే లారీలు దిగబడిపోవులే ! ఎల్లెల్లు" అంటూ చేతిలోని కర్ర ఎత్తాడు.

ఆమె ఆ కర్రనీ ఓ చేత్తో పట్టేసి - "ఎదవా ! నీ వొయినుకి అనుమానం జబ్బు. బొమికలిరిసేత్తాను ఆళ్ళు రాగానే పిలూ !" అంటూ పట్టుకున్న కర్రని విదిలించేసి లోపలికి వెళ్ళిపోయింది.

ఇంకా వెనకవైపు ఆ మిల్లు వాచ్‌మేన్ ఉండటానికి రెండు గదుల పట్టు ఉంది. అందులోకే నడిచింది రవణమ్మ.

పైసా ఖర్చు లేకుండా చూసిన సినిమాకు ఆనందిస్తున్నట్టు ఒక్కమారుగా డ్రైవర్ల బృందం నవ్వింది.

ఆమె వెనకే విసురుగా నడిచిన కొండయ్య గిరుక్కున వెనుదిరిగాడు. సర్దార్జీ చెయ్యూపి దగ్గరకు రమ్మన్నాడు. ముసలి సింహంలా నడిచాడు కొండయ్య.

"యే కౌన్ నే బుడ్డా?"

"తెరీ మారే బేటా" - విసురుగా అనేసి గేటు బయటకు నడిచాడు.

కోరస్ నవ్వులు బాణాల్లా వెనకనుంచి దూసుకు వస్తున్నట్లున్నాయి.

రమణమ్మని నరికేద్దామన్నంత కోపంగా ఉంది. మొదటి పెళ్ళాలు ఇద్దర్నీ తాను ఓ చూపు చూసేవాడు. ఎముకలు విరిచేసేవాడు. నేరకపోయి దీన్ని తెచ్చాడు. జలగలా పీల్చేస్తోంది. రాత్రీ పగలూ ఒకటే యావ.

కొండయ్య ఆవేశంగా గేటు బయటకు చేరేసరికి మనుషుల అలికిడి వినిపించింది. అతని ఆవేశం దిగిపోయింది. ఉత్సాహంగా వార్త చెప్పటానికి కదిలాడు.

మూర్తిది వ్యాయామం చేసిన శరీరం. బాక్సర్‌గా కాలేజీలో పేరుంది. అలాంటి శరీరంలో భావుకత్వం దాగుంది. క్రమబద్ధంగా చదువుతాడు. క్రమబద్ధంగా ఆలోచించగల ననుకుంటాడు.

సంజయ్ మాటలను అర్థం చేసుకునే యత్నంలో ఉన్నాడు మూర్తి. మానవుని మెదడుకి సమస్తాన్నీ స్వీకరించే ఓ స్థితి ఉంటుంది. ఒక్కో స్థితిలో అది అన్నింటినీ విశ్లేషించజూస్తుంది. ఓ దశలో తన కున్నదంతా వెళ్ళగక్కజూస్తుంది. మూర్తి మెదడు ఆ క్షణం మొదటి స్థితిలో ఉంది.

కొండయ్య కబురు వినగానే అంతవరకూ ఉన్న టెన్షన్ తొలగినట్టయింది. ప్రస్తుతాన్ని మరవటానికి సంజయ్ కబుర్లలో మునిగి ఉన్న మూర్తి మెదడు ఒక్కమారుగా ఉత్తేజమయింది. చటుక్కున లేచి నించున్నాడు.

"కిధర్...?"

"వోలోగ్ ఆరహేహైఁ."

"తో...?"

మూర్తి జవాబు దొరక్క కూర్చున్నాడు. సంజయ్ హిందీలో అన్నాడు - "ను వ్వింకా కుర్రాడివి బ్రదర్ ! పనిజేచే వెధవలచేత పని జేయించుకోవాలంటే కొంచెం కరకుండాలి. వాళ్ళకోసం నువ్వు పిచ్చెక్కించుకుంటే ని న్నో ఆట పట్టించేస్తారు - యాద్ రఖో !"

సంజయ్ చెడ్డవాడన్న భావన మూర్తిలో ఓ మెరుపులా మెరిసింది. చురుకుగా అన్నాడు - "నీ అభిప్రాయం తప్పు. పనివాళ్ళను గౌరవించాలి. న్యాయంగా వాళ్ళతో ప్రవర్తించాలి. వాళ్ళంతట వాళ్ళే పని చేస్తారు."

గుంపు లోపలికి వచ్చింది.

గుంపు కళ్ళు నర్సింహులు మీదా, అతని కళ్ళు మూర్తిమీదా, లారీలమీదా నిలిచాయి. వాళ్ళంతా అలా నిలబడిపోవటంతో కొండయ్య గట్టిగా కేకలు వేస్తూ నర్సింహులువైపు నడిచాడు.

"లారీకి ఏభై కావాలిట" - కొండయ్య మూర్తి దగ్గరకి వచ్చి చెప్పాడు. అతనికి అర్థం కాలేదు. అర్థమయాక ఏం చెయ్యాలో తోచలేదు. తను జాయినయాక మొదటిసారి వచ్చిన సరుకు ఇది. రాజుగారు తాను జాయినైన వెంటనే షిప్‌మెంట్ అయి పేమెంటు వచ్చిందని చాలా సంతోషించారు. వాళ్ళ కోరికలో న్యాయాన్యాయాల మాట అటుంచి సరిగ్గా అలాంటి అదనులో వాళ్ళు ఆ రకంగా గుత్తకూలి పెంచమననటం మూర్తికి దారుణంగా అనిపించింది. ఉవ్వెత్తున పొంగిన కోపంతో గుంపువైపు నడిచాడు.

"ఇది న్యాయం కాదు నర్సింహులూ !"

నర్సింహులు జవాబు ఇవ్వలేదు.

"పెద్దాయన లేరు. కొత్తణ్ణీ కుర్రాణ్ణీ నేను. ఇప్పుడు ఇలా అడుగటం అధర్మం."

నర్సింహులు మాట్లాడకపోవటంతో అరుంధతి అంది.

"లారీ లొచ్చినప్పుడేమో ఆరుండరు. ఆరున్నప్పుడు లారీ లుండవు. మేం అడిగితే ఆరు సూద్దార్లెండంటాడు. ఇప్పుడు అడక్కపోతే ఎప్పుడడగాలండి?"

సంజయ్ వచ్చి "క్యా క్యా?" అన్నాడు.

తమ రాష్ట్రం వాళ్ళు ఇంత అన్యాయపరులని తెలియజెప్పటం మూర్తికి అయిష్టంగా ఉంది. "కుఛ్‌భీ నై" అన్నాడు.

"అయితే మీరు సరుకు దించరా?"

"అలా గెందుకంటాం బాబూ? పెద్దాయనతో నువ్వు సెప్పేలా సెప్పాల. మా కడుపులూ సూడాల" - నర్సింహులు అన్నాడు.

తనకు వాళ్ళు ప్రాధాన్య మిస్తున్నట్లని పించటంతో వాళ్ళ కోరిక సమంజసమైనదే అయుంటుం దనిపించింది.

"తప్పకుండా చెపుతాను నర్సింహులూ. ఆయనా మంచివారు. ధర్మానికీ, న్యాయానికీ కట్టుబడే మనిషి. మీకు అన్యాయం చెయ్యరు..." ఉత్సాహంగా ఉంది మూర్తి గొంతు.

ఆ భరోసా నర్సింహులికి సరిపోయింది గాని, అరుంధతికి చాల్లేదు. నర్సింహులువైపు చూసింది అరుంధతి.

"ఏభై రూపాయ లిస్తేగాని పన్లోకి రామన్నట్టూ నువ్వు వప్పుకున్నట్టూ చెప్పా లంటున్నారు గుమస్తా బాబూ ! మా కుర్రాళ్ళు..."

"ఆయన ఒప్పుకోకపోతే నేను నా జేబులోంచి ఇవ్వాలా?" కటువుగా అడిగాడు.

"మాకూ నీతీ, జాతీ ఉన్నాయి బాబూ" - నర్సింహులు ఏదో అనబోయాడు.

"ననుగుడెందుకూ? డ బ్బెవరి జేబులోదైతేనేటి? మనకి కావల్సిందదే..." వెనకనుంచి ఎవరో అన్నారు.

## ప్రయాణం

"మీ ఆడబడుచు చీటికీ మాటికీ చిటపట లాడేదన్నావ్ - ఇప్పుడు చూస్తే చాలా నెమ్మది మనిషిలా మారిందేం?" అడిగింది వాణి.

"ఇప్పుడు జాబ్ చేస్తోంది - ఆఫీస్ కెళ్ళడానికి కిక్కిరిసిన బస్‌లో గంటన్నర పాటూ ప్రయాణం చేయాల్సి వస్తోంది - అలా మూడు గంటలు వెచ్చిస్తోందిగా - బస్ పుణ్యమాని ఓపిక అలవాటయింది." వివరంగా చెప్పింది రాణి.

-వాలి వీణామాధురి
[హైదరాబాదు]

ఆ మాటని కప్పుకురావటానికి నర్సింహులు అన్నాడు.

"గుంటపావలు బాబయ్యా. నిన్న కానీ డబ్బు కొచ్చీది అణా యెడితేగాని యియ్యాల రాటంలేదు. సాలక నచ్చిపోతనాం. మా కట్టం సుకం ఆరికి సెప్పాల. పని జరిపించాల. నువ్వా తొందరపడితే యెలా?"

జరుగుతున్న అన్యాయాన్ని ఎలా ఎదుర్కోవాలో తెలీక కొంత - లారీలలో సరుకు దించకపోతే ఆ స్థితిని ఎలా నిర్వహించాలో తెలీక కొంత - మూర్తికి చెమట పట్టింది. ఎండిన గొంతుని తడుపుకుంటూ ఆదుర్దాగా అన్నాడు.

"నేను చెప్తాను లెండి ! మీరు లారీలు ఎక్కండి."

"పదండి పదండి !" నర్సింహులూ తరమటంతో లారీలవైపు కదిలాడు.

పని మొదలైంది.

అనేక రకాల. జంతువుల దుమ్ములు. ఎక్కడెక్కడో పుట్టి . చచ్చిన వాటివన్నీ మూకుమ్మడిగా చిత్రమైన శబ్దాలతో కిందకి ఉరుకుతున్నాయి. పడుతున్న కుప్పలలోంచి లాఘవంతో మానవుల ఎముకలూ, పుర్రెలూ వేరు చేస్తున్నాయి కొన్ని చేతులు. అవిమాత్రం ఎందుకూ పనికిరావు. కుప్పలు కెలకటంతో కంపు పెరిగింది.

ఆ కంపు పెరగటంతో మూర్తి ఉద్రేకాలూ, ఆలోచనలూ మారసాగాయి. దూరంగా కుర్చీలో స్తిమితంగా కూర్చున్న తనకే ఇంత దుర్భరంగా ఉంటే, ఆ కంపులో చేతులకి గాని, ముక్కుకి గాని ఏలాంటి తొడుగులూ లేకుండా పని చేస్తున్న వాళ్ళకి ఎలా ఉండి ఉంటుంది? తన అనుభవానికి అందని ఆ స్థితిని అంచనా వేయజూడటంతో అతనిలో పుట్టి పెరిగిన సానుభూతి అతనిమీద పని చేయసాగింది.

సంజయ్ బింద్రాతో ఒరియాలో మాట్లాడాడు. బింద్రా సరే నన్నట్టు తలూపాడు. సిగరెట్టు మూర్తికి ఆఫర్ చేశాడు.

మూర్తి చిరునవ్వుతో వద్దన్నాడు.

సంజయ్ సిగరెట్ కాలుస్తూ మూర్తి చేయి పట్టుకుని దూరంగా తీసుకెళ్ళాడు. గేటు బయట నూరు వరాల చెట్టు కింద సిమెంటు బెంచీమీద కూర్చున్నారు. దూరంగా నగరపు వెలుతురు చిత్రంగా ఉంది.

జేబులోంచి తీసినది అతని చేతిలో ఉంచుతూ- "రఖో భాయ్ !" అన్నాడు సంజయ్.

మూర్తి షాకవుతూ తన చేతిలోకి చూశాడు. రూపాయ నోట్లు. అతనికేమీ అర్థమవలేదు. అయోమయంగా - "ఏ క్యాహై?"

అర్థవంతంగా నవ్వుతూ - "రఖియే భాయ్ !" అన్నాడు.

"కిస్‌లియే?" కొంత అర్థమైనా అనుమాన నివృత్తికోసం అడిగాడు.

సంజయ్ మాటలతో అనుమానం తొలగిపోయింది. తాను తప్పుడు లెక్క రాయాలి. సరుకు ఎక్కువ చూపాలి. ఇది మామూలే. మునుపటి గుమస్తా కన్నా ఎక్కువ ఇచ్చామన్న ధోరణిలో మాట్లాడాడు.

మూర్తి నరాలన్నీ బిగుసుకున్నాయి. రగులుతున్న ఆవేశాన్ని అణుచుకోజూస్తున్నాడు. కలుగుతున్న భావాలకు హిందీ వాక్యాలు దొరకటంలేదు. ఆవేశంగా ఆ డబ్బు అక్కడే పడేసి - "మై ఐసా ఆద్‌మీ నహీఁహూఁ !" వేగంగా విసురుగా గేటు దాటి లోపలికి వచ్చాడు.

అత నిచ్చిన డబ్బు తాను తీసుకోడు. అంతే ! తాను అధర్మం చేయడు గాని మరొకరిది ధర్మబద్ధంగా ఉంచలేడు. ఉంటే దండించలేడు. ఇలా అనుకున్నాక మూర్తికి గొప్ప అశక్తతగా, అసహ్యంగా అనిపించింది. సంజయ్ సామీప్యాన్ని భరించలేక దుమ్ముల దగ్గరకు పోయి నించున్నాడు.

పెత్తనాల రత్తమ్మ వెకిలిగా నవ్వుతూ - "ఏం బాబూ ! కూకుని కూకుని... నొప్పెట్టిందా?" అంది మోటుగా.

మూర్తికి ఆమె అంటే ఏవగింపు. భయం. అయితే ఆమె సంస్కారం తనకన్న దిగువస్థాయిది. ఆమె అలా ఉండటం గూర్చి జాలిపడాలే తప్ప కోప్పడకూడదు - అనుకుంటూ తనకు తాను నచ్చజెప్పుకుంటాండు. కానీ ఆ సమయంలో అతనికి ఆమె ప్రవర్తన చికాకు పెంచింది.

"నీ పని నువ్వు చేసుకో" - అన్నాడు ఉడుకుమోత్తనంగా.

పక్కనున్న మనిషికి తట్ట ఎత్తుతూ - "బాబూ. పెళ్లాన్ని కూడా యిలాగే వంచి..." మోటు మాటతో పూర్తి చేసింది.

"ఊరుకోయే ! నీకు సిగ్గూ సెరం లేదు !" అంటూ తట్ట నెత్తి నుంచుకుని మునివేళ్ళతో బుగ్గమీద పొడుస్తూ నడిచింది.

మూర్తి అక్కడి నుంచి కదిలాడు.

కాటా దగ్గర కొండయ్యా, నర్సింహులూ, అప్పన్నా సర్దుకుంటున్నారు. ఓ ఖాళీ లారీ బయటకి నడిచింది. కాటావైపు నడుస్తున్న మూర్తి కంటికి గుళ్ళున్న బల్లకింద ఏదో ఉన్నట్టు కనిపించింది. దాన్ని అతనంతగా పట్టించుకోలేదు. కొండయ్యా కాలితో దాన్ని సర్దడం చిత్రంగా అనిపించినది.

"ఏం చేస్తున్నావు కొండయ్యా?"

కొండయ్యా అర్థవంతంగా నవ్వాడు. అలాంటిదే నవ్వు కొంతసేపటి క్రితం సంజయ్ నవ్వాడు.

మూర్తి నవనాడులూ క్రుంగిపోయినట్టయ్యాయి. పట్టుబడిలో మోసం జరుగుతుంది. సందేహం లేదు. కొండయ్యకు మిగిలేదేం లేదు. ఇది మామూలుగా జరిగే మోసమే. ఇంతకు ముందున్న గుమస్తా అటు వాళ్ళ దగ్గర డబ్బులూ తీసుకునేవాడు. ఇటు పట్టుబడిలో రాజుగారికి మిగులూ చూపెట్టేవాడు. తను...? లంచాన్ని సులువుగానే వద్దన్నాడు. ఈ మోసాన్ని...? ఈ మోసంవల్ల తనకు పని చూపిస్తున్న వాడికి లాభం వస్తుంది. ఆ లాభానికి అడ్డుపడటం ధర్మమా? మూర్తికి ఆలోచన తెగటానికి కొద్దిపాటి సమయం పట్టింది.

"కొండయ్యా !"

"బాబూ !"

"బల్లకింద బరువుతీసెయ్."

కొండయ్యా గొంతు తగ్గించి - "అదేటి బాబూ ! రాజుగారూ..." ఏదో అనబోయాడు.

"ఆయనకి ఈ చండాలప్పని తెలుసా?"

కొండయ్యా సరిగ్గా జవాబివ్వలేకపోయాడు. తనకి తెలిసున్న దగ్గర నుంచి ఇది జరుగుతోంది. గుమస్తా జరిపిస్తున్నాడు.

"అందువల్ల రాజుగారికి తెలిసుండదు" - అన్నాడు మూర్తి ఓ నిర్ణయానికి వస్తూ.


కొండయ్యా సణుగుతూ నించున్నాడు.

"కొండయ్యా ! నేను చెప్పినట్లు చెయ్యటమే నీ పని. న్యాయం ధర్మం నిలపటమే నా పని. పెద్దాయన పొమ్మంటే పోతాను" - అసహనంగా అన్నాడు.

అలా అనేటప్పుడు మూర్తి కొంత ప్రయాసపడవలసి వచ్చింది. అన్నాక చిత్రమైన గర్వంతో రొమ్ము విశాలమైంది.

పట్టుబడి మొదలైంది.

లెక్క జాగ్రత్తగా వేస్తున్నాడు. ప్రతిసారీ సంజయ్‌కి చూపిస్తున్నాడు. సిగరెట్ కాలుస్తూ



మొహం ముడుచుకునే ఉన్నాడు సంజయ్.

సరుకు దిగుతోంది. మనిషి దుమ్ములు వేరుగా కుప్పబడుతున్నాయి. పట్టుబడి చురుకుగా సాగుతోంది. దించిన సరుకు అయిపోవడంతో కొంతసేపు పట్టుబడి ఆగింది.

మూర్తి ముక్కు కంపుకి అలవాటుపడింది. గాలిలో సాగుతోంది బీహారీ పల్లెపదం. ఆ గొంతులో మైకం ఆ వాతావరణంలో చిత్రంగా ఉంది. మూర్తి లఘుశంక కోసం చీకట్లో మామిడి చెట్ల వెనక్కి నడిచాడు.

అల్లంత దూరాన డ్రైవర్ల అడావుడిలో ఏదో గొంతు - ఆడగొంతు - నవ్వు వినవస్తోంది. కుతూహలంగా అటు చూశాడు. ఎవరో ఉన్నారు. పోలిక వెంటనే దొరకలేదు.

అటు నడిచాడు.

పెత్తనాల రత్తమ్మ !

అతన్ని ఒక్కమారుగా కోపమూ, దుఃఖమూ చుట్టుముట్టాయి. ఆ స్త్రీ అంత లజ్జావిహీనంగా పరాయి మగవాళ్ళ మధ్య చేరినందుకు కోపం కలిగింది. ఆమె తెలుగుదీ, వాళ్ళు మరో భాష వాళ్ళూ అయినందుకు అతనికి తెలీకుండానే దుఃఖం కలిగింది.

ఆమె చాలా ఆబగా దుమ్ములు నములుతోంది. మధ్యలో ఒకడి గ్లాసులో మందు ఓ గుక్కెడు నోట్లో పోసుకుని పుక్కిలించుతోంది. ఆవిడకు నలభై పైనే వయసుంటుంది. శరీరంలో ఉండవలసిన వేవీ ఉండాల్సిన విధంగా ఉండాల్సిన చోట్లలో లేవు. ఆవిడతో ఉండదలుచుకున్న వాడెవడైనా, కేవలమూ ఓ ఆడప్రాణితో ఉన్నట్లు తృప్తిపడాలి. పై భాగంలో నిరాచ్ఛాదనగా ఉంది.

చూసి చూసి - "రత్తమ్మా !" కోపంగా బిగ్గరగా అరిచాడు.

ఆవిడ వెకిలిగా నవ్వింది. "ఏం బాబూ ! నీకూ కావాలా...?" సరజ్జలతో మోటు మాటలతో అడిగింది.

మూర్తికి మొహంమీద కొరడాతో కొట్టినట్టయింది.

"తాడిసెట్టు నీడ నీడటోయ్ బుల్లోడా
తగులుకున్నావోడు... మొగుడటోయ్..."

అంటూ పాడుతోంది రత్తమ్మ.

గిరుక్కున వెనక్కి తిరిగి వచ్చేశాడు. ఏం చేయాలో తోచలేదు. నర్సింహులిని పిలిచాడు. జరిగింది చెప్పబోయాడు.

"పోన్లెండి బాబూ. దిక్కు మొక్కూలేనిది. పలావు మెతుకులకి పాకులాడతంది..." అన్నాడు.

నర్సింహులు మాటకి మరింత నిర్ఘాంతపోయాడు మూర్తి. ఆకలిని ఆ నిరక్షరాస్యుడు చూసినట్టు తాను చూడలేకపోయానని క్రమంగా అనిపించింది. ముందు నరసింహులు మెత్తదనం మింగుడుపడలేదు. వర్దాక నర్సింహులు మీద గౌరవమూ, రత్తమ్మమీద జాలీ కలిగాయి. ఉవ్వెత్తున పొంగిన ఆ జాలిలో నెల కొకమారయినా ఆవిడకు ఓ పలావు పొట్లం ఇవ్వాలనిపించింది.

ఆమె ఊరికే తీసుకుంటుందా? తీసుకోక తనకున్నది ఇవ్వజూపితే? స్త్రీ గురించి ఊహ తప్ప ఏమీ తెలియని ఆ యువకుడి శరీరమంతా గగుర్పొడిచింది. విశాలమైన వికృతమైన ఆమె నగ్నత్వం కళ్ళముందు నిలిచి కదలనని మొరాయించింది. తల్లి నగ్నత్వాన్ని చూడాల్సి వచ్చినప్పుడు కలిగే దుఃఖంతో కూడుకున్న అసహ్యం మూర్తిలో చెలరేగింది.

ఇంతలో మళ్ళీ మొదలైంది పట్టుబడి.

మూడు లారీలు ఖాళీ అయి బయటున్నాయి.

పని పూర్తవవస్తోంది. చాలామంది ఆడవాళ్ళూ, పిల్లలూ నర్సింహులుతో చెప్పి గూడెం వెళ్ళిపోయ్యారు. ముసలాళ్ళు ఏరివేత పనిలో ఉన్నారు. నిశ్శబ్దంలో "యెయ్యి ! ఆఁ ! సాలు" అంటున్న నర్సింహులు గొంతే వినిపిస్తోంది.

మూర్తి లెక్కలో నిమగ్నమవుతున్నాడు.

హఠాత్తుగా చిన్న కేక వినిపించింది.

అంతా అటు చూశారు.

మళ్ళీ కేక వినపడలేదు.


మూర్తికి ఏదో అనుమానం వచ్చింది. బాణంలా డ్రైవర్ల బృందంవైపు దూసుకుపోయాడు. ఆరుగురికీ ముగ్గురే మంచాల మీదున్నారు. మందు వాసన గుప్పున కొడుతోంది. కొద్ది దూరంలో లోతట్టున మామిడీ చెట్లకింద ఎవరో పెనుగులాడుతున్న అలికిడి. మూర్తి అటు పరుగెత్తాడు.

రత్తమ్మ అడ్డమొచ్చింది. ఆమె ఏదో అనబోతుంటే నెట్టేసి మామిడి చెట్లకింద నడుస్తున్న అలికిడివైపు కదిలాడు. అక్కడ దృశ్యం అతని శరీరాన్ని భగ్గున మండించింది.

ఓ వ్యక్తి ఓ ఆడమని. నోటిని ఓ చేత్తో మూసి రెండు చేతులూ వెనక్కి విరిచి పట్టుకుని లొంగదీస్తున్నాడు. రెండోవాడు ఆమెని నగ్నం చేస్తున్నాడు.

వెనకా ముందూ చూడలేదు మూర్తి.

భారీగా ఉన్న ఆ మనుషులముందు పిట్టలా ఉన్నాడు మూర్తి. వ్యాయామం చేసిన శరీరం చెప్పినట్టల్లా వింది. నలుగురూ అక్కడికి చేరేసరికి ఆ అమ్మాయిని విడిపించగలిగాడు. మూర్తికీ



దెబ్బలు గట్టిగానే తగిలాయి.

అందరూ రత్తమ్మని తన్నినంత పంజేశారు. ఏదో నెపంతో ఆ అమ్మాయిని పక్కకి తీసుకువచ్చి వాళ్ళకి అప్పగించిందిట. డ్రైవర్లు వాళ్ళ భాషలో ఏదో గట్టిగా తిట్టుకుంటున్నారు. మూర్తితో కలియబడిన వా ళ్ళిద్దరూ అతన్ని తినేసేలా చూస్తున్నారు. ఒకతను వెళ్ళి రత్తమ్మను గుద్దాడు. అతన్ని విడిపించారు. సంజయ్, బింద్రా డ్రైవర్లను బ్రతిమాలుతున్నారు.

మూర్తి శరీరమంతా నొప్పులు పెడుతోంది.

ఇంతలో మిల్లు వెనకనుంచి కేకలు.

అంతా పరుగెత్తారు. రవణమ్మని కొడుతున్నాడు కొండయ్య. ఆమె ఆదిశక్తిలా ఊగిపోతూ కొండయ్య చేతిలోని కొప్పు విడిపించుకోజూస్తోంది. చివరకి ఆమె బయట పడింది. తిరగబడి భర్తని కొట్టడం మొదలెట్టింది. ఆమె, డ్రైవరు లోపల గదిలో ఉన్నారుట.

"కొండయ్యా !" అంటూ అడ్డుకోబోయాడు.

అతను మహోద్రేకంగా ఊగిపోతూ బండబూతులు తిడుతూ చేతికి అందిన ఎండుకొమ్మని విరుస్తున్నాడు. కొందరు రమణమ్మను పట్టుకున్నారు.

అరగంట గడిచింది.

లారీలు వెళ్ళిపోయాయి. లెక్క తేల్చుకున్న సంజయ్, బిద్రా డబ్బు కోసం రేపు వస్తామని వెళ్ళిపోయారు. గూడెం మనుషులు గూడెంలోకి వెళ్ళిపోయారు.

కొండయ్య కేకలు అప్పుడప్పుడు వినిపిస్తున్నాయి.

రమణమ్మ ఏడుపూ, తిట్లూ కలగలసి ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తున్నాయి.

దొడ్డికి తాళాలు వేయించి - దుమ్ముల కుప్పల మధ్య - మంచం వాల్చుకుని - నల్లటి ఆకాశం కింద - తెల్లని చుక్కలను చూస్తూ - నొప్పిపెడుతున్న శరీరంతో ఆలోచనలు నమిలేస్తున్న మెదడుతో నిద్ర చేరని కళ్ళతో పడుకుని ఉన్నాడు మూర్తి.

కొంతసేపు తెలుగు జాతి మీదా, ఆమీద ఆడవాళ్ళమీదా, ఆ తరువాత ఆకలిమీదా అతనికి కోపం చెలరేగింది.

క్రమంగా ఆ స్థానంలో ఓ రెండు కృతజ్ఞత నిండిన కళ్ళు ప్రవేశించి స్థిరపడసాగాయి.

స్థిరపడుతున్న ఆ కళ్ళు రగిలిస్తున్న ఆలోచనలలో ప్రేమా, వివాహమూ వంటి ఊహలు చేరి అతనికి ఊపిరి ఆడకుండా చేసి ఆ సంతోషాన్ని పారద్రోలి దుఃఖాన్ని ఆహ్వానించసాగాయి.

చివరకి ఆ కళ్ళ స్థానంలో ఓ విచిత్రమైన హర్షం, క్రమంగా గర్వమై అతన్ని గాలిలో తేల్చుతూన్న అనుభూతితో నెమ్మదిగా నిద్ర పట్టింది.

అరవై ఏళ్ళ వాడి మూడో పెళ్ళాం ఇరవై రెండేళ్ళ రవణమ్మ గొంతు లోకాన్ని శపిస్తున్నట్లు ఆ నిశ్శబ్దంలో అప్పుడప్పుడు వినిపిస్తోంది.

అన్నిచోట్లా దుమ్ముల వాసన వ్యాపించి ఉంది.

★